# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 14-09-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ వరదలతో ఇబ్బంది పడుతున్న రాష్ట్రాన్ని కేంద్ర ప్రభుత్వం ఆదుకుంటుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హామీ ఇచ్చారు.
- ❖ విజయనగరంలో శ్రీ పైడి తల్లి అమ్మవారి ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు.
- ❖ విశాఖపట్నంలో "బి.ఎస్.ఎన్.ఎల్ వై-ఫై" సేవలు ఈ రోజు నుంచి ప్రారంభయ్యాయి.
- ❖ రాష్ట్రంలో ఈరోజు వివిధ జిల్లాలో లోక్ అదాలత్ ను నిర్వహించారు.
- ❖ దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయవ్య గాలుల ప్రభావంతో ఒక మోస్తరు వర్షాలు పలు జిల్లాల్లో కురుస్తాయని వాతావరణ కేంద్రం పేర్కొంది.

=====================

వరదలతో ఇబ్బంది పడుతున్న ఆంధ్రప్రదేశ్ ను కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ హామీ ఇచ్చారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని ఈరోజు ఆయన సతీసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ... పోలవరం ప్రోజెక్టుతో సహా అనేక అభివృద్ధి కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం నిధులను విడుదల చేస్తోందని అన్నారు. వరద వల్ల దెబ్బతిన్న రాష్ట్రానికి ఇప్పటికే తాత్కాలిక సాయం అందించటం జరిగిందని తెలిపారు. వరద నష్టంపై కేంద్రం ప్రభుత్వం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసిందని మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 26 సెకన్లు)

=====================

విజయనగరంలో శ్రీ పైడి తల్లి అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల నిర్వహణకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ నిర్వహణపై కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధ్యక్షతన కలెక్టరేట్ లో ఈరోజు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అక్టోబరు 13, 14వ తేదీలలో అమ్మ వారి వార్షిక జాతర ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు. సుమారు 2 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఈ ఉత్సవాన్ని నిర్వహించేందుకు ప్రణాళికను రూపొందించామని వివరించారు. ఈ ఉత్సవాలకు సుమారు ఐదారు లక్షల మందికి పైగా భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని మంత్రి వెల్లడించారు. దేవాదాయ, పర్యాటక శాఖలతో పాటు ఈ సంవత్సరం సెర్ప్, చిన్న, సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల శాఖను కూడా భాగస్వాములను చేయడానికి నిర్ణయించామని మంత్రి తెలిపారు.

======================

కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ లక్ష్యమని విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. పెండింగు కేసులను పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని పేర్కొన్నారు. విశాఖపట్నంలో ఈ రోజు నిర్వహించిన “జాతీయ లోక్ అదాలత్” కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

జాతీయ లోకాదలత్ లో వివిధ కేసులు సత్వర పరిష్కార దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతోందని తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, గంధం సునీత అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా న్యాయమూర్తి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు.

======================

భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ (BSNL) విశాఖపట్నం వాణిజ్య విభాగం "సర్వత్రా బి.ఎస్.ఎన్.ఎల్ వై - ఫై" పేరుతో రోమింగ్ సర్వీస్ సేవలను ఈ రోజు విశాఖపట్నంలో ప్రారంభించింది. ఫైబర్-టు-ది-హోమ్ కస్టమర్లందరికీ వైఫై మెరుగైన కనెక్టివిటీతో సేవలు అందించడమే లక్ష్యమని విశాఖపట్నం టెలికమ్ జిల్లా ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పాల్ విల్లమ్ అన్నారు. డిజిటల్ సాధికారతతో పాటు, డిజిటల్ కనెక్టివిటీని పెంపొందించడంలో BSNL ముందడుగు వేసిందని తెలిపారు. వినియోగదారులకు విశ్వసనీయమైన ఇంటర్నెట్ సేవను అందించడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ ఉచిత Wi-Fi రోమింగ్ స్కీమ్ ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

======================

“స్వచ్ఛతా హి సేవ” కార్యక్రమాన్ని అందరి భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి అన్నారు. ఈరోజు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా రాజీవ్ మార్గ్ వద్ద నుండి కోటిరెడ్డి సర్కిల్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీని కలెక్టర్ శివశంకర్ లోతేటి, కడప శాసనసభ్యులు మాధవి రెడ్డి సంయుక్తంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు “స్వచ్ఛతా హి సేవా” కార్యక్రమం ఈనెల 17వ తేదీ నుండి అక్టోబరు 1వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. కాగా, జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీలలో “స్వచ్ఛతా హీ సేవా” కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు.

======================

దిగువ ట్రోపో ఆవరణంలో పశ్చిమ, వాయవ్య దిశగా గాలులు వీస్తున్నాయిని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం పేర్కొంది. దీని ప్రభావంతో రానున్న 2 రోజులలో రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులను వాతావరణ అధికారి తెలియచేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

======================

ప్రజా ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం ప్రతి ఒక్కరికి ఆరోగ్యమనే నినాదంతో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇప్పటి వరకు ఎంతోమంది పేదవారు ఈ పథకం కింద లబ్ధి పొందారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో కూడ ఈ పథకం అమలు అవుతుంది. ఇప్పటి వరకు ఈ పథకం లబ్ధిదారుడికి 70 సంవత్సరాల వరకు పరిమితి ఉండేది. అయితే ఇప్పుడు 70 సంవత్సరాల పైబడిన వారికి కూడా ఈ పథకం అమలు అయ్యేలా కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లా ప్రజలు ఆకాశవాణితో మాట్లాడుతూ... ప్రజలందరికీ మేలు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఎంతో శుభ పరిణామని అన్నారు.

విరామం

=====================

ప్రపంచ దేశాలలో తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలు ఈ రోజుకీ నిలిచి ఉన్నాయంటే దానికి కారణం రామాయణం మాత్రమేనని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో మొల్ల కాంస్య విగ్రహాన్ని మైసూర్ ఎంపీ, యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ ఈ రోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, నన్నయ్య ఆదికవి అయితే ఆది కవయిత్రి మొల్ల అని అభివర్ణించారు. రామాయణాన్ని అచ్చ తెలుగులో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అనువదించిన మహా కవయిత్రి మొల్ల అని అన్నారు. మొల్లను ఆదర్శంగా తీసుకుని బాలికలు ఉన్నత చదువులు చదవాలని ఆయన ఆకాంక్షించారు. అదే విధంగా చేతివృత్తులు, కులవృత్తులను కాపాడుకోవాలని కోరారు. యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ మాట్లాడుతూ... ఎన్నో శతాబ్ధాల నుండి కన్నడ, ఆంధ్ర రాష్ట్రాలకు మధ్య సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తు చేశారు.

=====================

“హిందీ దివస్”ను పురస్కరించుకుని కాకినాడలో ఈ రోజు ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్, సమాచార ప్రసార శాఖ, క్షేత్ర కార్యాలయం కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాకినాడ క్షేత్ర ప్రచార అధికారి శ్రీరామమూర్తి కందాళ మాట్లాడుతూ... 1949లో రాజ్యాంగ పరిషత్ హిందీని భారతదేశ అధికార భాషల్లో ఒకటిగా ఆమోదించిన రోజును పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం సెప్టెంబరు 14వ తేదీన హిందీ దివస్ జరుపుకొంటున్నామని తెలిపారు.

=====================

చిత్తూరు జిల్లాలో మొగలి ఘాట్ వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఘటనపై రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ధర్మవరంలో ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ... మృతుల కుటుంబాలకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ ఘటన పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విచారం వ్యక్తం చేశారని మంత్రి తెలిపారు. ప్రభుత్వం నుండి మృతుల కుటుంబాలకు 5 లక్షల రూపాయలు, క్షతగాత్రులకు లక్ష రూపాయలు ఆర్థిక సహాయాన్ని ఆయన ప్రకటించారు. అదేవిధంగా క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయాలు అందిస్తున్నామని మంత్రి మంత్రి తెలిపారు.

=====================

ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజలలో విశ్వాసం పెంచేలా ఉత్తమ సేవలు అందించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి ప్రభుత్వ అసుపత్రి వద్ద నూతన మార్చరీ రూమ్, వేస్టేజ్ స్టోర్ రూమ్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని ఈ రోజు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పేదలకు ఉత్తమ వైద్య సేవలు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యమని పేర్కొన్నారు.

=====================

ఎన్టీఆర్ జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు వరదల వల్ల ముంపుకు గురై నష్టపోయిన బాధితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తున్నట్లుగా కలెక్టర్ జి.సృజన ఈ రోజు పాత్రికేయులకు తెలిపారు. నష్టాల వివరాలను పారదర్శకంగా నమోదు చేశామని అన్నారు. రేపు రాష్ట్ర ప్రభుత్వానికి ఈ నివేదికను సమర్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. కాగా, విజయవాడలోని సింగ్‌నగర్, వాంబే కాలనీ ప్రాంతంలో పర్యటించి నష్ట వివరాల డేటా రీవెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. ముంపునీటి కారణంగా భవనాల మొదటి అంతస్తులో ఎలాంటి నష్టం జరిగినా వారికి కూడా న్యాయం చేస్తామని అన్నారు.

=====================

కృష్ణా నది నీటి వినియోగంపై బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జిలాలు వినియోగించుకున్నా కరవు ప్రభావిత ప్రాంతాల్లో కృష్ణా జలాలు వాడుకునే హక్కు తమకు ఉందని ఆ లేఖలో తెలిపింది. కృష్ణా బేసిన్‌లో పాత ప్రాజెక్టుల కింద నీటి వినియోగానికి రక్షణ ఉందని, ఆ అంశాన్ని సమీక్షించడం సరికాదని పేర్కొంది. కృష్ణా జలాల విషయంలో బచావత్ ట్రిబ్యునల్ ఆదేశాలు అమలు చేయాలని లేఖలో రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ నెల 20న తమ వాదనలను వినిపిస్తామని పేర్కొంది.

=====================

=====================